# కొత్త కేలెండర్లు

### అయ్యగారి విశ్వేశ్వరరావు

చూసినకొద్దీ ఆ కనులన్నీ చోద్యంగా వున్నాయి మీనాకళ్ళకి. ఎంత హాయిగావుంది చూస్తూంటే అనుకుంది మీనా. కాంత యింకా గర్వంగా అంటుంది. మావారు ఇంకా చాలాచోట్ల పుచ్చుకున్న కేలండర్లని ఎవరెవరికో అడిగింతే తడవుగా ఇచ్చారు. లేకపోతేనా-యింకా కిటకిటలాడేవి-గదులు కొత్త కాలెండర్లతో అంది కాంత.

అయితే-యీ కేలండర్లు కొన్నవి కాదన్న మాట! అంది ఆతురతతో మీనా. చ చా! ఏమంత ఖర్మం కాలింది. ప్రతికంపెనీవాళ్ళకీ మావారు తెలుసు. ఇళ్ళకి తెచ్చియిచ్చారు మీనా! అదిగో ఆ ఫ్లష్ పుటులో పడేసి వుంచాం చూడు పది కేలండర్లు గుట్ట-కనిపించటంలేదూ! అంది కాంత.

సరదాలేని మొగుడు సంతకెళ్ళినా! అనుకుంది మీనా. కాంత నిజంగా పెట్టిపుట్టింది. రేడియో, ఫోన్, చక్కని కుర్చీలు, మర్యాదకి స్టెయిన్ లెస్ స్టీలు గ్లాసులు. ఆహా-కాంతదే సంసారసుఖం అనుకుని మీనా గుడ్లు మిటకరించి చూసింది ఇంకో కేలండర్ల వైపు.

ఇదిగో యీ నటరాజు కేలండరు అంది చూశావూ-వరల్డు ఫస్టు ప్రైజు పొందిన బొమ్మ. ఎంతోమంది ప్రయత్నించారు దీని కోసం. రెవ్వరికీ లభ్యం కాలేదు. ఎంత అందంగా వుందంటావ్ మీనా. అదిగో అది రాధాకృష్ణ చిత్రం. బలేబావుందికదూ-అని కాంత చెబుతూంటే మీనా అనుకుంది-తనకో కేలండరు ఇమ్మనమని అడుగుదామని. ఇంతలోనే యింటోవున్న కేలండర్లని వర్ణించి యిలా అంది కాంత. ఏదైనా ఇస్తానుకాని-కేలండరు ఇమ్మనమంటే ఎవరికైనా సరే! చస్తే ఇవ్వను! ఎదటివాళ్లు యేమైనా అనుకోని-అంటూ.

మీనాకి యీ గర్వం నచ్చలేదు. ఇంక యెవళ్ళకీ లభ్యం కావా! ఈపాటి కేలండర్లు అనుకుంది. పంతానికైనా వచ్చే ఆదివారం నాటికి కాంతని మన యింటికి టీకి ఆహ్వానించాలి. ప్రతిగుమ్మానికీ ఒక కేలండరు వుండేటట్టు చేయాలి. ఇంతకన్న షోకైన కేలండర్లని సంపాదించాలి. మావారితో చెప్పాలి. అవసరమైతే డబ్బెట్టి కొనాలి. మావారి దగ్గర డబ్బులేకపోతే నా పెట్టె అడుగున వున్న బ్లాక్ మనీతోనైనా కొనాలి అని తీర్మానించింది మీనా.

మర్యాదచేసి-మంచి మాటలతో కాంతను సాగనంపింది మీనా. తప్పక వచ్చే ఆదివారం మీ వారితో సహా రావాలి సుమండీ మా యింటికి-ఆ వేళ మా పుట్టినరోజు అని డబాయించింది మీనా. ఎలాగైనా-యింతకన్నా నాజూకు కేలండర్లతో కాంతని హారతించాలి. ఒక మంచి కేలండరు ఎక్స్ట్రాగా తీసుకుని-బుద్ధివచ్చేటట్లు ప్రెజంటు చేయాలి. ఇవన్నీ చూసి కాంత ఒక గుణపాఠం నేర్చుకుంటుందిలే-అనుకుంటూ మీనా తిరుగు ముఖం పట్టింది యింటికి. తలుపు తాళంతీసి చూసేసరికి అప్పుడే అయిదున్నర అయింది. యిలా అనుకుంటూ మీనా ముస్తాబై-శ్రీవారి కోసం ఎదురుచూస్తూంది.

మరి కొంతసేపటికి చిరాకుగా శర్మ యింటికి వచ్చాడు. అన్నింటికీ చిరాకే. రాగానే వుత్తరాలేమైనా వచ్చాయా? అని అడిగాడు. రాలేదంది మీనా. అవేవిటి ఆ కిటికీలో వున్నవి—పాత వుత్తరాలా! అన్నాడు శర్మ. తీరా చూస్తే అవి పాత వుత్తరాలు కాదు. కొత్త పోస్టు కార్డులు—ఆ వేళటి పోస్టు ముద్రతో నిగనిగలాడుతున్నాయి. అమాంతంగా శర్మ ఆగ్రహించి యిలా అన్నాడు. "రాణీగారు ఎక్కడికైనా సర్క్యూటు కొట్టారా యేవిటి! పోస్టు వచ్చిన వేళకి!"—బలే వారండీ దొంగని యిట్టే పట్టుకున్నారు. నిజానికి యే పోలీసు డిపార్టుమెంటులో చేరాలసిన వారు పొరపాటున పోవరు డివిజను గుమాస్తాగా జనించారు!" అంది మీనా.

నాజన్మకేల వస్త్రాల మాట అటుంచు నువ్వు పొరుగింటికి వెళ్ళితంటే నే—నాకు బెంగ! గుండె దడదడలాడుతుంది-అన్నాడు శర్మ.

అదేవిటండీ—మరీ చిత్రంగా మాట్లాడుతారు. ఆడాళ్ళయాక అస్తమానూ ఇంట్లోనే అఘోరించాలంటారా. ఇరుగూ-పొరుగూ యేమవాలి. అస్తమానూ ఇంట్లోనే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే యేం తోస్తుంది అంది మీనా.

వెళ్ళిన దానివి తిన్నగా వుంటావుకదకనా-అన్నాడు శర్మ.

తిన్నగా వుండక పిశాచంలాగ పీడించానా అంది మీనా చిరుకోపంతో.

ఇంకా పిశాచాలే నయమేమో. జాలి దలిచి వదుల్తాయి అన్నాడు శర్మ.

చాల్లెండి—మీరూ మీ కబుర్లూనూ. నేనేమీ అలాంటిదాన్ని కాదుఅంది మీనా.

కాదు మీనా, మొన్న దసరాల ముందు మీ ఫ్రెండు ఇంటికి వెళ్లావ్. ఆవిడ కొనుక్కున్న చీరలు చూసేసరికి నీకు మతి పోయింది. ఇంటికి వచ్చి చీరల బెంగతో నువ్వు చూపించే దశావతారాలూ చూసేసరికి నేను నీరయిపోయాను. అప్పుచేసి ఆఖరకు నీ అలక తీర్చాను. ఆ అప్పు ఇంకా తీరలేదు అన్నాడు శర్మ.

ఓస్-యింతేకదా. అలికి చీర కొనడం కూడా ఘనకార్యమేనా! అని చప్పరించింది మీనా. మగాడి కష్టాలను గమనించకుండా ఖర్చులు పెంచే ఆడాళ్ళని తలుచుకుని దణ్ణం పెట్టాడు తనలో శర్మ.

వాళ్ళని చూసి—వీళ్ళని చూసి చెవికివున్న దుద్దుల్ని మీనా లేదంటే ఇప్పటికి ఆరుసార్లు మార్చింది. అలాగే ముక్కు కేసరి కూడా మారింది. కాలిపట్టీల మాట యింక వేరే చెప్పాలా, ఈనాటి ట్రిప్పు తనకేం ముప్పో అనుకున్నాడు శర్మ యింకా తనలోనే.

పోయి చకచకా కాఫీ తెచ్చింది మీనా. ముస్తాబయిన మీనా! ఇప్పుడే పెత్తనానికి పోయివచ్చిన మీనా! ఎందు కింత హుషారుగా వుంది? ఇదేదో ముందరి కాళ్ళకి బంధంలాగా వుంది-అనుకుంటూండగానే మీనా-శర్మ ఇలా మాట్లాడుకుంటున్నారు.

'మనకి కొత్త సంవత్సరం చాలా బాగుంటుంది కదాండీ'

'ఓ—దర్జాగా వుంటుంది!'

'అయితే-ఒక్క కేలండరయినా తెచ్చారు కాదేం'

'ఆ కేలండర్ల పిచ్చ నాకేమీ లేదు. నీకెందుకుండాలి'

'అలా అంటారేవిటండీ! నవనాగరకతకు చిహ్నం కేలండరు'

# ★ కొత్త కేలండర్లు ★

'అయితే'

'కేలండర్ లేనివాని యిల్లు-యిల్లే కాదు'

'అలాగయితే-పంచాంగం కేలండరు యివాళే కొనితెచ్చాను లే'

'ఛా! వుప్పుడిపిండి తిన్నట్లు. అదేం కేలండరు. గోడ అందం కూడా బండ్'

'మరేం కొనాలంటావ్'

'మూడు రంగుల కేలండర్. ముగ్గులొలికే కేలండర్, చూచేవాళ్ళని ముగ్ధుల్ని చేసే కేలండర్. అలాంటివి బహువచనంలో వుండాలి'

'నీకు గొంతెమ్మ కోరికలు చాలా వున్నాయి నే చెప్పలే, నీ చెప్పు నాకు ముప్పు.'

'కేలండరుతో నే ముప్పు వస్తుందనడం శుద్ధ తప్పు. సాహసించినందుకు క్షమించండి'

'మీనా!-తేదీలు తెలుసుకోవడానికేగా కేలండరు. ఈ పంచాంగం కేలండరుతో తిథులు-పండుగలు-శెలవుదినాలు-అన్నీ తేలికగా తెలుసుకోవచ్చు. ఇదుగో గోడకు కొట్టు'

'దాని మొహం చూస్తేనే నాకు కోపం. బొమ్మల కేలండరు-ధగధగ లాడే దర్జా కేలండరు తీసుకురండి. నా మొగుడూ ప్రయోజకుడే అని చెప్పుకోనీండి'

'కేలండరు తెచ్చిన మొగుడేనా-మీ మహిళా మండలి దృష్టిలో మహోన్నతుడు'

"అక్షరాలా అంతే. ఇందాకా మన కాంతి యింటికి వెళ్ళాను ఎన్ని కేలండర్లు ఊపిరి సలపకుండా—గోడనిండా అవే. అప్పుడు మన గోడలూ—మీరు జ్ఞాపకానికి వచ్చారు."

"ఓహో! అదా దీని పునాది! ఫైన్"

"మా వారు తెచ్చారమ్మా ఎన్నో కేలండర్లు తీరుబడిలేక తగిలించలేదన్నాను. ఆదివారంనాడు టీకి రమ్మన్నాను. ఆదివారం అంటే ఎల్లుండి. ఆవిడ వస్తుంది. గొప్పకి—మా యింట్లో కేలండర్లని చూసే మతిపోతుందన్నాను. ఏం చేద్దామంటారు?"

"ఇందులో యేముందిలే. ఇప్పటికి జీతాలలో ఆఖరికి యిరవై రూపాయలున్నాయి. మంచి అంగడికిపోయి—చిన్న సరుకు కొని పెద్ద కేలండరు పొందాలి. అలా పదికొట్లు తిరిగామంటే—పది కేలండర్లు చాలవూ—మన గదికి—ఏమంటావ్ మీనా?"

"వెరీగుడ్—మంచిప్లాను, మరి యిప్పుడే పోదాంరండి."

ఇలా కూడ పలుక్కుని ఆ భార్యాభర్తలు ఆనందంగా పెద్దబజారుకు పోయారు. ఒక పెద్ద ఫేన్సీ షాపు చూశారు. బలే షాపుంది. శర్మ అన్నాడు—మీనా! వీడు పెద్ద కేలండరుని అచ్చు వేయించి వుంటాడు. వేవాత్సాగా కేలండర్ని యిమ్మంటే ముఖం ముడుచుకుంటాడు. కొంపిలుగా తిద్దాం చిన్న చిన్న సామానుల్ని-అనగానే మీనా సరేనంది. ఇదరూ కొట్లోకి పోయారు. రెండు రూపాయలతో టాల్కం పవుడరు టిన్—స్నో బాటిలు-కొన్నారు. బిలు ప్రకారం పైకం చెల్లించినా షాపు కీపరు కేలండరు బహుమానించలేదు. శర్మ తనంతట తానే నోరు తెరిచి అడగానే- ఆ పెద్ద మనిషి-సారీ-యీ యేడు మేం కేలండరు వేయించలేదు సార్ అన్నాడు. శర్మ చిన్నబుచ్చుకున్నాడు—మీనాతో.

ఇంకో కొట్టు పెట్టుకొని యిలా చేశాం అంది మీనా వాడి తాతలాంటి కొట్లున్నాయి. అదిగో ఆ పెద్దబట్టల కొట్టుకు పోదాంరా అంటూ శర్మ—మీనాతో ఆ కొట్లోకి వెళ్లాడు. పదిరూపాయలతో వచ్చే కోయంబత్తూరు చీర కొన్నాడు. కేలండరు మాట వీడూ యెత్తటంలేదు. ఇది కూడా వేస్టేనా? అనుకుంటున్నాడు శర్మ. అనుకున్నట్టుగానే అయింది. కాకపోతే—వేసిన కేలండర్లు అయిపోయాయి సార్ అన్నాడు వీడు మన దురదృష్టం అనుకుంది మీనా.

కాను—యిప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. ఆ పక్క కొట్లో మూడు సబ్బుబిళ్లలు కొంటే ముద్దైన కేలండరు యిస్తున్నాడట. పోదాంరా అని మీనాతో శర్మ ఆ కొట్టుకు పోయాడు. సబ్బుబిళ్లలు కొన్నాడు. పైకం యిస్తూ బొమ్మల కేలండరు బహుమానం యివ్వరా? అన్నాడు, అరె—గడువు తేదీ దాటి పోయిందండీ. యీ కన్సెషను నిన్నటితో సరి అని సానుభూతి చూపించాడు షాపుకీపరు.

మీనాకి నిరాశ బయలుదేరింది. చెవులో కాంతి గర్వం మాటలే కంకుమంటున్నాయి. తన పిలుపు కూడా దప్పుడు చేస్తోంది. కేలండరు సంపాదించలేని శర్మ కూడా దిగాలు పడ్డాడు.

ఈ చీరకి ఆ ఫాన్సీ సరుకులకి పెట్టే డబ్బుతో ఎన్ని కేలండర్లయినా కొనచ్చు. మిగతా డబ్బుతోనైనా కొందాం రండి—అంటూ మీనా భర్తకి హెచ్చరించి పై బజారుకు పోయింది.

ఒకచోట పెద్ద పెద్ద కేలండర్లున్నాయి. ధరజాస్తే అయినా మీనా లెక్క చేయకుండా పది కేలండర్లని కొంది తన డబ్బుని కూడా భర్తకిచ్చి. ఆనందంగా కాఫీకబ్బుకి వెళ్లారు. ఫేమిలీరూములో కేలండర్ల కథ చెప్పుకుంటూ టిఫిన్ తీసుకుంటూ ఆనందిస్తున్నారు. ఆ ఆనందంలో కాంతి వచ్చి ఏమనుకుంటుంది—యీ కేలండర్లని చూసి అనుకుంటున్నారు. చేయాలనుకున్నది సాధించాననుకుంది మీనా, భార్య చేసిన ప్రతిజ్ఞ ఫలించినందుకు గర్వించాడు శర్మ, హాయిగా కాఫీ ఆరగించి యివతలకు వచ్చి బిల్లు చెల్లించారు. కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ యింటివైపు వస్తున్నారు. కొత్త చీరతో-టాల్కం పవుడరుతో స్నోసీసాతో కొత్త కేలండర్లతో గుమ్మెత్తిపోతుంది ఆదివారం. నిజంగా పండగ, పుట్టినరోజు పండగ అన్నందుకు దర్శనిలవెట్టారు అంది మీనా భర్తని అభినందిస్తూ!

అయితే మీనా కేలండర్ల కట్టరేది? అన్నాడు శర్మ.

మీరు తెస్తున్నారు అనుకున్నాను. అంతలోనే చీర—టాల్కం పవుడరు టిన్ను స్నోబాటిలు పార్సెలు చేయించాంగా! అంది డీలాగా మీనా.

అయితే ఆ పార్సెలు కాఫీహోటలులో మరిచిపోయామా! అంటూ యిదరూ గబగబా తిరిగి కాఫీహోటలుకు వెళ్ళి వెతికారు. ఎక్కడుంది? లేదు! చిన్నబోయింది మీనా. ఏం చేయాలో తెలియటంలేదు శర్మకి.

మాయరోజులు సార్ అన్నాడు హోటలు ప్రొప్రయిటరు.

భార్యాభర్తలు గుండె బరువుతో ఇంట్లోకి చేరారు. ★


